శృంగార వీధి

# రెగులర్ ఎపిసోడ్

ఆకెళ్ళ రాఘవేంద్ర

**నా అధరాల అడ్రెస్ నాకే తెలీడంలేదు. అవును మరి.. ఆయన తన పెదాల్తో నా పెదాల్ని కప్పేస్తున్నప్పుడు-నా పెదాల పదనిసలు ఆయనలో సరిగమలు పలుకుతున్నప్పుడు- వాటి స్పర్శే నాకు తెలీడంలేదు. ఆ మాటకొస్తే నా శరీరంలోని ప్రతిఅవయవమూ తన చిరునామాను కోల్పోయింది.**

అమృతమైన ఆ ఆనందాన్ని ఇస్తున్న నాపతిదేవుణ్ని... నాలో బీజావాపం చేస్తున్న ఆయన్ను... శృంగారప్రబంధాలు నా శరీరంపై లిఖిస్తున్న శ్రీవారిని... మరోసారి గట్టిగా వాటేసుకు న్నాను. నా పిచ్చిగానీ అప్పటికే కౌగిలింతలో పరాకాష్ఠకు చేరుకున్న మా శరీరాలకు మళ్లీ కౌగి లింతేమిటి? ఇంకా... ఇంకా... అదుముకోవాలనివుంది. కాని.. ఎంతని? అదుముకుందామనుకున్నా ఇక మా శరీరాలమధ్య శూన్యప్రదేశమే శూన్యమాయె!

అరగంటసేపు యుద్ధం చేసుకున్న తరువాత అలసిపోయాం. ఆ అలసట శరీరాలకేగాని మనసులకు కాదు. ఉదయపు వాగ్యుద్ధం తాలూకు దుఃఖం ఆవిరైపోయి... అంతులేని ఆనందం ఆవరించిన తరవాత... తిరిగి యుద్ధం! అంతవరకూ పరస్పరగాఢాలింగనంలో విశ్రాంతి. ఇది తాత్కాలికమైన శాంతి మాత్రమే!

ఇంతటి అమృతతుల్యమైన ఆనందాన్ని అందించిన ఆయన్ను తనివితీరా ముద్దులలో ముంచెత్తాను. ఇంతటి సంతోషాన్నీ... సంతృప్తినీ ఇస్తున్న ఈయన్నా నేను ఉదయం కసురుకున్నది? నా శరీరాన్ని తీయని అమృతంలో ముంచి ఆరేస్తున్న ఈ వ్యక్తిపైనా ఉదయం నేను నోరు పారేసుకున్నది?

ఈ రోజు ఉదయం జరిగి సంఘటన గుర్తొచ్చింది.

"ఏమే! టిఫిన్ రెడీయేనా? అప్పుడే తొమ్మిదయింది. ఆఫీసుకు వెళ్లాలి. టిఫిన్ రెడీ చేశావా? అబ్బబ్బ! నీదెప్పుడూ ఆలస్యమే!" హాల్లో టీవీ చూస్తూ శ్రీవారి అరుపులు. అలా అరవడం అప్పటికి అయిదోసారేమో!

ఆయన అరుపులు విన్న నాకు కోపం నసాళానికంటింది. అప్పటికి టిఫిన్‌చేసి టేబుల్‌పైన పెట్టి అరగంట అయింది. "మీరు తినండి మహాప్రభో!" అని పదిసార్లు చెప్పా. అయినా వినిపించుకోకపోగా నన్ను ఆడిపోసుకుంటున్నారు.



మళ్లీ ఆయన కేకలు! నాకు ఒళ్లు మండింది. చెప్పొద్దూ, నాకు ఇట్టే కోపం వచ్చేస్తుంది! వంటింట్లో కలుపుతున్న కాఫీని పక్కనపెట్టి హాల్లోకి విసవిసావెళ్లా. "అరగంటక్రితం టిఫిన్ రెడీ అని చెప్పా. టీవీలో పాటలు చూస్తూ కూర్చోకపోతే టిఫిన్ తినొచ్చుగా! పైగా నామీద నెపం పెట్టేస్తున్నారు!" అని గయ్‌గయ్‌లాడాను.

దాంతో ఆయనకూ కోపం వచ్చింది. ముఖం మాడ్చుకున్నారు. అదిచాలక "అట్టు మాడింది నీ మొహం!" అని నన్ను అన్నారు. నాకు ఒళ్లు మండింది. ఉదయం అయిదింటి నుంచీ ఆపకుండా పనిచేస్తున్నా. నాకు పనిలో సాయం చేయకపోగా, సాధింపులొకటి! నేను ఓ మాటన్నాను. ఆయనో మాటన్నారు. కోపంతో నాతోపాటు మావాళ్లనూ అన్నారు. నేనేం తక్కువ తినలేదుకదా? చిలికిచిలికి గాలివానయింది. కోపంతో ఆయన ఆఫీసుకు వెళ్లిపోయారు.

ప్రతిరోజూ మాకు ఈ తరహా 'మార్నింగ్ షో' మామూలే!

నా కనురెప్పలపైన ఆయన తడిఆరని పెదవులు గాఢంగా వాలడంతో తిరిగి ఈ లోకంలోకి వచ్చాను.

ఉదయంనుంచి సాయంకాలంలోగా మాటామాటా వచ్చి ఇద్దరికీ కోపం వచ్చేస్తుంది. చిన్నచిన్న విషయాల్నికూడా పట్టించుకుని లేనిపోని గొడవలు తెచ్చిపెట్టుకుంటాం. అయితేనేం-సాయంకాలమయ్యేసరికి వీధిగుమ్మం దగ్గర నిలబడి ఆయన కోసం వేయికళ్లతో ఎదురు చూపులు చూస్తాను. 'త్వరగా రండి పతిదేవా!' అంటూ మనసులోనే కోరుకుంటాను.

ఆఫీసునుంచి ఆయన వస్తారు. స్నానంచేసేసి టీవీ ముందు కూర్చుంటారు. ఉదయం జరిగినదానికి చంటిపిల్లాడిలా బింకాలు పోతారు. భోజనాలుకూడా మౌనంగానే జరిగిపోతాయి.

రాత్రి పక్కమీదకు చేరి... ఆయనకు పక్కగా జరిగి... "సారీ!" అంటాను.

అయినా ఆయన ఇంకా నటిస్తున్న కోపాన్ని ప్రదర్శించడం మానరు.

"మాకింకా ఎంతసేపు సార్... ఈ నిరీక్షణ? ఒళ్లంతా ఒకటే నొప్పి సార్! 'పెయిన్ రిలీఫ్ బామ్' మీ దగ్గర పెట్టుకుని మమ్మల్ని ఇలా బాధపెట్టడం... అన్యాయం సార్!" అంటాను.

"మన డెయిలీ ఎపిసోడ్‌లో రెగ్యులర్ డైలాగేకదా ఇది!" అని అంటూ నాకేసి ఓరగాచూసి ఒక్క చిర్నవ్వు నవ్వుతారు.

"సారీ మాస్టారూ! నాకు ఇట్టే కోపం వచ్చేస్తుంది" అంటాను.

"నీవు ఎప్పుడూ కోపంతోనే వుండాలి. ఎందుకంటే చిరుకోపంలోనే నీవెంతో అందంగా వుంటావు కనుక!" అంటారాయన.

ఆ మాటతో-ఉవ్వెత్తున ఎగసిపడిన అల శిలను తాకి పునీతమైనట్లు ఒక్కసారిగా ఆయన్ను గాఢాతిగాఢంగా కౌగలించుకుంటాను. ప్రేమపురస్సరంగా ముద్దాడుతాను. దానికి బహుమతిగా ఆయనే 'వలువల తలుపులు' తొలగించి స్వర్గసుఖాలకు మార్గం చూపిస్తారు.

ఉదయంనుంచి గిల్లికజ్జాలతో సాగే మా ప్రయాణం రాత్రయ్యేసరికి పొద్దు కరిగినట్లు మనసుల్లోని కోపతాపాలు కరిగిపోయి-ఇద్దరం ఒకటవుతాం. ఇద్దరమూ ఏకమై... ఒకరిలో ఒకరు ఐక్యమై...తాదాత్మ్యపుఅంచుకు చేరుకుంటాం. ■

